
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల
జిల్లా వార్తలు

శనివారం 8 జూన్ 2024



ఆ నలుగురిలో.. అమాత్యులెవరో..?

- మంత్రి పదవికి తీవ్ర పోటీ
- నంద్యాల జిల్లా నుంచి రేసులో నలుగురు?
- విధేయులకా? సీనియర్లకా?
- కేబినేట్ విస్తరణలో చోటు దక్కేదెవరికి?
- అధిష్ఠానం ఎంపికపై సర్వత్రా ఉత్కంఠ



నంద్యాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అఖండ మెజారిటీతో గెలిచింది. ఈ నెల 12వ తేదీన కొత్త ప్రభుత్వం కొలువుదీరబోతోంది. దీంతో ఇపుడు అందరి దృష్టి నంద్యాల జిల్లా నాయకులపై పడింది. ఇక్కడి నుంచి మంత్రివర్గంలో స్థానం దక్కేదెవరికి? అమాత్య కిరీటం ఎవరిని వరించనుంది? అని ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఇక జిల్లా నుంచి ప్రధానంగా పలువురు రేసులో ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. నంద్యాల ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, బనగానపల్లె నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన బీసీ జనార్దన్‌రెడ్డి, డోన్ ఎమ్మెల్యే, మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ మంత్రి పదవిని ఆశిస్తున్నారు. జిల్లా పరంగా చూస్తే మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ప్రస్తుత పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత కూడా మంత్రిపదవి రేసులో కనిపిస్తున్నారు. అయితే ఆమె మాత్రం చంద్రబాబు మాటే శిరోధార్యం అన్నట్లు ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో టీడీపీ అధిష్ఠానం వీరిలో ఎవరివైపు మొగ్గుతుంది? ఎవరికి మంత్రి వర్గ విస్తరణలో చోటు కల్పిస్తుందో వేచి చూడాల్సిందే!

జిల్లాలో టీడీపీని నిలబెడుతూ..

జిల్లాలో మంత్రి పదవిని దక్కించుకోబోయే వారిలో మొదటగా వినిపిస్తున్నది బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి పేరు. వైసీపీకి అనుకూలంగా ఉన్న నంద్యాల జిల్లాలో ఆయనే మొదటి నుంచి బలంగా నిలిబడ్డారు. 2014 ఎన్నికల్లో నంద్యాల పార్లమెంటు పరిధిలో అన్ని స్థానాల్లో వైసీపీ జెండా ఎగురవేస్తే బీసీ ఒక్కడే ఆ పార్టీ గాలిని తట్టుకుని గెలిచారు. ఇక 2019 ఎన్నికల్లో ఓడిపోయినా.. ప్రత్యర్థి కాటసాని రామిరెడ్డి లాంటి ఎమ్మెల్యేను దీటుగా ఎదుర్కొంటూ పార్టీ కేడర్‌ను కాపాడుకుంటూ వచ్చారు. అంతేకాకుండా మిగిలిన నియోజకవర్గాల టీడీపీ నేతల్లో కూడా స్ఫూర్తి నింపారు. టీడీపీ జెండాను జిల్లాలో ముందుండి నడిపించారు. ఎన్నికలు, అభ్యర్థిత్వంతో సంబంధం లేకుండా నిత్యం ప్రజలతో మమేకమవుతూ వచ్చారు. దీంతో ఆయన గెలుపు ఖాయమంటూ ఏడాది కాలంగా ప్రచారం సాగింది. జిల్లాలో టీడీపీ తరఫున బీసీ జనార్దన్‌రెడ్డి బలమైన అభ్యర్థి అనే విషయాన్ని గుర్తించిన అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బనగానపల్లెలో నిర్వహించిన ఓ సభలో బీసీ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారంటేనే అర్థం చేసుకోవచ్చు.. బీసీ చరిష్మా ఎలాంటిదో! ఇక టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతో బీసీకి సన్నిహిత సంబంధాలు కూడా ఉన్నాయి. స్కిల్ డెవలప్‌మెంటు కేసులో అరెస్టయిన తర్వాత విజయవాడలోని కోర్టుకు వెళ్లే వరకు చంద్రబాబు వెంటే ఉన్నారు. వివాదరహితుడిగా పేరున్న బీసీ అటు పార్టీ పరంగా చూసినా, ఇటు చంద్రబాబుతో ఉన్న సన్నిహిత సంబంధాల దృష్ట్యా మంత్రి పదవి రేసులో ముందు వరుసలో ఉన్నారు.

సీనియర్ నేత కోట్లకూ అవకాశం!

మంత్రి పదవిని ఆశిస్తున్న వారి జాబితాలో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి కూడా కీలకంగా ఉన్నారు. ఆయన మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనా.. గతంలో మూడుసార్లు కర్నూలు నుంచి ఎంపీగా, ఒకసారి కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు. అసలు కోట్ల మొదటి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా కాకుండా, ఎంపీ టికెట్‌ను ఆశిస్తూ వచ్చారు. ఇక ఆయన సతీమణి కోట్ల సుజాతమ్మ ఆలూరు ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. అయితే టీడీపీ అధిష్ఠానం ఆమెకు టికెట్ నిరాకరించి, కోట్లను డోన్ ఎమ్మెల్యేగా నిలబెట్టారు. అధిష్ఠానం ఆశలను వమ్ము చేయకుండా.. కోట్ల కుటుంబం మొత్తం కలిసి కట్టుగా పనిచేసి బలమైన ప్రత్యర్థి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని ఓడించారు. తమకు ఇవ్వాల్సిన టికెట్ ఇవ్వకుండా, ఇక గెలిచిన తర్వాత మంత్రి పదవి ఇవ్వకపోతే ఊరుకునే పరిస్థితుల్లో కోట్ల కుటుంబం లేదు. కేంద్ర మంత్రిగా పనిచేసిన కోట్ల అనుభవాన్ని ఉపయోగించుకోవాలని టీడీపీ అధిష్ఠానం నిర్ణయించుకుంటే కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డికి మంత్రి పదవి దక్కినట్లే.

మరోసారి మంత్రి పదవి కోసం..

జిల్లా నుంచి మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కించుకుని మరోసారి మంత్రి కుర్చీలో కూర్చోవాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తహతహలాడుతున్నారు. 2014లో వైసీపీ తరఫున ఆళ్లగడ్డ నుంచి ఏకగ్రీవంగా ఎంపికైన ఆమె తదనంతర పరిణామాల్లో టీడీపీలో చేరారు. అప్పటి నంద్యాల ఎమ్మెల్యే, ఆమె తండ్రి భూమా నాగిరెడ్డి మరణం తర్వాత అఖిలప్రియ టీడీపీ ప్రభుత్వంలో పర్యాటక శాఖ మంత్రిత్వ శాఖ పదవిని దక్కించుకున్నారు. ప్రస్తుతం ఆళ్లగడ్డ నుంచి మరోమారు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మహిళా కోటాలో తనకు మంత్రి పదవి దుక్కుతుందన్న ధీమాతో ఉన్నారు. దీనికి తోడు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్‌తో సన్నిహిత సంబంధాలు ఉండటం కూడా ఆమెకు కలిసి వచ్చే అంశం. ఇప్పటికే అఖిలప్రియ తనదైన శైలిలో మంత్రి పదవి దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

ఇలా పలువురు పేర్లు వినిపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికే విస్తరణ ఖాయమైపోయిందని, ఇదే మంత్రివర్గ జాబితా అంటూ సోషల్ మీడియాలో ఓ పోస్టు చక్కర్లు కొడుతోంది. అయితే అదంతా వట్టిదేనని, మంత్రివర్గ కూర్పుపై టీడీపీ అధిష్ఠానం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కనీసం చర్చించిన దాఖలాలు కూడా లేవు. ఈ నెల 12వ తేదీన సింగిల్ డిజిట్‌గా కొందరిని మాత్రమే మంత్రి వర్గంలోనికి తీసుకుని చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం. ఆ తర్వాత మరో వారం రోజుల్లో పూర్తి మంత్రివర్గ కూర్పు ఉంటుంది. మొత్తం మీద నంద్యాల జిల్లా నుంచి మంత్రివర్గంలో ఎవరు ఉంటారన్నది రెండువారాల సమయం పట్టే అవకాశం ఉంది.

విధేయుడిని వరించేనా?

జిల్లా నుంచి మంత్రి రేసులో ఉన్న మరో కీలక నేత.. మైనారిటీ సీనియర్ నాయకుడు ఎన్‌ఎండీ ఫరూక్. టీడీపీ ఆవిర్భావం తర్వాత పార్టీలో పలువురు వస్తూ పోతూ, జంపింగ్ జిలానీలుగా పేరుగాంచినా ఫరూక్ మాత్రం 40 ఏళ్లుగా పార్టీలోనే కొనసాగుతున్నారు. ఆయన వీర విధేయతను చూసి ముచ్చటపడిన టీడీపీ గతంలో ప్రభుత్వ హయాంలో ఫరూక్‌ను పలుమార్లు మంత్రి పదవుల్లో కూర్చోబెట్టింది. ఓసారి కౌన్సిల్ చైర్మన్‌గా కూడా ఎంపిక చేసింది. 1985-89 వరకు ఎన్టీఆర్ హయాంలో చక్కెర శాఖ మంత్రిగా పనిచేశారు. అనంతరం చంద్రబాబు హయాంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా 1994-99 వరకు పనిచేశారు. 2017-18 వరకు శాసనమండలి చైర్మన్‌గా వ్యవహరించారు. తర్వాత చంద్రబాబు హయాంలో మైనార్టీ సంక్షేమ, వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా 2018-19 వరకు పనిచేశారు. వ్యక్తిగతంగా కూడా ఫరూక్ వివాద రహితుడిగానే పేరుంది. ప్రస్తుత ఎన్నికల్లో ఫరూక్‌ను నంద్యాల నుంచి పోటీ చేయాలని పార్టీ నిర్ణయించింది. దీంతో ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. వయసురీత్యా రాజకీయంగా కూడా ఆయనకు ఇదే చివరి అవకాశం కావచ్చు. ఇన్ని అంశాలకు తోడు, రాయలసీమ జిల్లాల నుంచి టీడీపీ అధిష్ఠానం మైనారిటీల వైపు చూస్తే మంత్రి పదవి రేసులో ఫరూక్ ముందువరుసలో ఉన్నారు.

విద్యార్థుల భాషా పరిజ్ఞానాన్ని పెంచండి: డీఈవో



మాట్లాడుతున్న డీఈవో

నంద్యాల (నూనెపల్లె), జూన్ 7: విద్యార్థుల్లో భాషా పరిజ్ఞానం, సబ్జెక్టులో అవగాహన పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో సుధాకరరెడ్డి సూచించారు. శుక్రవారం నంద్యాలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లాలోని 29 మండలాల నుంచి 87 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఫౌండేషన్ లిటరసీ, సబ్జెక్ట్ అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు డీఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి లలితమ్మ, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

39 కేజీల గంజాయి పట్టివేత



గంజాయిని తగులబెడుతున్న పోలీసులు

నంద్యాల క్రైం, జూన్ 7 : జిల్లాలోని నాలుగు సబ్ డివిజన్ల పరిధిలో ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు శుక్రవారం దాడులు చేసి 39.223 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయి విలువ సుమారు రూ.4,70,676 విలువ ఉంటుందని పోలీసులు తెలిపారు. దీన్ని అయ్యలూరుమెట్టకు సమీపంలో ఉన్న విజయ పాల డెయిరీ ఎదుట ఖాళీ ప్రదేశంలో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ జయరాములు, ఎస్సై జి. రామనాథ్ పాల్గొన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే బుడ్డా



ఆత్మకూరు, జూన్ 7: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను శుక్రవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి కలిశారు. ఇటీవల జరిగిన శ్రీశైలం అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా తొలిసారిగా మంగళగిరిలోని నారాలోకేశ్ ఇంటికి వెళ్లి పుష్పగుచ్ఛాన్ని అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ బుడ్డా రాజశేఖర్ రెడ్డిని ఆత్మీయంగా పలకరించి, నియోజకవర్గంలో ఎన్నికల తీరుపై ఆరా తీశారు.

అభినందలు తెలిపిన భూమా బ్రదర్స్





నంద్యాల నూనెపల్లె: టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారాలోకేశ్‌ను నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి, టీడీపీ యువ నాయకుడు భూమా విఖ్యాత్ రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో కూటమి భారీ విజయం సాధించడంపై లోకేశ్‌ను సత్కరించి అభినందనలు తెలియజేశారు.

వర్షం పలకరింపు.. పుడమి పులకరింపు..

- ఉక్కపోత నుంచి ఉపశమనం
- ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతన్నలు
- జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు



దుక్కులు పూర్తయి సాగుకు సిద్ధమైన పొలాలు

నంద్యాల టౌన్, జూన్ 7: మూడు నెలలుగా ఉష్ణోగ్రతల తీవ్రత కారణంగా ఉక్కపోతతో, ఎండ తాకిడితో అల్లాడిపోయిన ప్రజలకు ఉపశమనం లభించింది. నైరుతీ రుతుపవనాల కారణంగా ఈ వారంలో వరుసగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఉక్కపోత తగ్గుముఖం పట్టింది. ఖరీఫ్ సీజన్‌కు జూన్ నెల నుంచే సన్నద్ధం కావాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ వర్షాల రాక ఆలస్యం కారణంగా ఖరీఫ్‌కు సన్నాహాలు కూడా కొంత మేర ఆలస్యమైంది. జిల్లా వ్యాప్తంగా రాత్రి సమయంలో వర్షం దంచి కొడుతుండటంతో పొలాలన్ని పదును అయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో ఎక్కువ శాతం వర్ష పాతం నమోదు కాగా, మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. ప్రస్తుత వర్షాలకు పొలాన్నీ బాగా పదును కావడంతో ఇప్పటికే ఒక దఫా దుక్కులు పూర్తి అయిన కారణంగా, మరోసారి దుక్కులకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసుకోవడానికి అత్యంత అనుకూలమని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. అయితే పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై సరఫరా చేయడంలో గత ప్రభుత్వం వైఫల్యం చెందిందన్న ఆరోపణలను రైతులు గుప్పిస్తున్నారు. వ్యవసాయ శాఖ ప్రతిపాదనలకు అనుగుణంగా పచ్చిరొట్ట ఎరువులను రైతులకు అందజేయలేదని సమాచారం.

చల్లబడిన వాతావరణం

మూడు నెలలుగా గరిష్ట ఉష్ణోగ్రతల కారణంగా భానుడి భగ భగలతో ప్రజలు అల్లాడిపోయారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వాతావరణం చల్లబడింది. ఉక్కపోత నుంచి ఉపసమనం జనం పొందుతున్నారు. జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కొన్ని చోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కూడా ఏర్పడుతోంది. పొలాలు పదును కారణంగా జీలుగ, పిల్లిపెసర, తదితర పచ్చిరొట్ట విత్తనాలను రైతులు తమ పొలాల్లో చల్లుకుంటున్నారు. ఈనెలాఖరు లేదా జూలై తొలి వారంలో ఖరీఫ్ సీజన్‌కు విత్తనాలు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో కౌలు రైతులు కూడా పొలాలను గుత్తకు తీసుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

ఈనెల 3వ తేదీన జిల్లాలో భారీ వర్ష పాతం నమోదైంది. బనగానపల్లె, పాణ్యం, శ్రీశైలంతో పాటు పలు మండలాల్లో వర్షం దంచికొట్టింది. జిల్లా వ్యాప్తంగా 56.7 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది. అలాగే 6వ తేదీన బేతంచెర్ల, సంజామల, పాణ్యం, బండిఆత్మకూరు, డోన్, తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 25.9 మిల్లీమీటర్ల వర్ష పాతం గురువారం నమోదైంది. శుక్రవారం సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో శనివారం ఉదయం వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వర్షం కురిసింది.

ఆర్‌ఏఆర్‌ఎస్‌లో విత్తనాలు సిద్ధం

నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఎన్‌డీఎస్‌హెచ్ -1012 ప్రభాత్ అనే పొద్దు తిరుగుడు హైబ్రీడ్ విత్తనాలను రైతులకు విక్రయించేందుకు శాస్త్రవేత్తలు సిద్ధం చేశారు. కేజీ పొద్దు తిరుగుడు విత్తనం ధర రూ.500 ప్రకారం మొత్తం 31 క్వింటాళ్లను రైతులు సాగు చేసుకునేందుకు సిద్ధం చేసినట్లు ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ డాక్టర్ సరళమ్మ తెలిపారు. వరి, తదితర పంటల్లో కూడా మేలైన వంగడాల విత్తనాలను రైతులకు అందజేయడమే కాకుండా సలహాలు, సూచనలు కూడా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మరో పక్క చిరుధాన్యాల పంటల విస్తీర్ణం పెంపుకు అఖిల భారత చిరుధాన్యాల సమన్వయ, పరిశోధనా పథకం ద్వారా విత్తనాలను ఆర్‌ఏఆర్‌ఎస్‌లో రైతులకు అందజేస్తున్నారు.

దుర్మార్గపు పాలన నుంచి ప్రజలకు విముక్తి

నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జూన్ 7: దుర్మార్గపు పాలన అంతానికి ప్రజలకు విముక్తి కలిగిందని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ కూటమి అఖండ విజయం సాధించిందన్నారు. జగన్ పాలన అంతా అరాచకంగా, విధ్వంసాలతో సాగడంతో ప్రజలు విరక్తి చెంది కూటమి అభ్యర్థులను గెలిపించారన్నారు. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయన్నారు. వైసీపీ పాలనలో బీసీలు, దళితులు, మహిళలపై, రాజకీయ పార్టీల నాయకులపై కక్ష సాధింపులతో దాడులు చేసి అక్రమ కేసులు బనాయించారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నైరుతి పవనాలు రాష్ట్రానికి ప్రవేశించి రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ నాయకులు, కార్యకర్తలను వేధించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు.

మండిగిరి సర్వే నెంబర్ 480ఏ, 481లో ఉన్న ఓపెన్ సైట్‌లో అక్రమణదారులు పాతిన బండలు



ఖాళీ స్థలమా? కబ్జా చేసెయ్..!

ఆదోని, జూన్ 7: ఖాళీ ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు, కబ్జాదారులకు పండగే. పండగ. స్థలాలను ఆక్రమించుకుని కట్టడాలు చేపడుతున్నా పట్టించుకునే నాథుడే లేరు. గత ఐదేళ్లుగా జిల్లాలో ఈ పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ నేతల అండదండలు పుష్కలంగా ఉండటంతోనే ఇష్టానుసారంగా ప్రభుత్వ స్థలాల దురాక్రమణ జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీ, రెవెన్యూ అధికారులు సైతం చూసీ చూడనట్లుగా ఉదాసీనంగా వ్యవహరించడంతో విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంత మయ్యాయి. ఆదోని పట్టణానికి ఆనుకుని ఉన్న మండగిరి గ్రామ పంచాయతీ పరిధి బైపాస్ రోడ్డులోని శ్రీనివాస, పద్మావతి ఎస్టేట్‌లో సర్వే నెంబర్ 480ఏ, 481లో 40 సెంట్ల స్థలం ఓపెన్ సైట్‌గా ఉంది. అందులో ఆ కాలనీ సంబంధించిన పార్కు, దేవాలయాలు, తాగునీటి ట్యాంకులు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా ఓపెన్ సైట్ ఉంచారు. ఇందులో ఎలాంటి కట్టడాలకు వీలులేదు. ఇలాంటి ఓపెన్ సైట్‌లో కొంత మంది కాంపౌండ్ కోసం గుంతలు తవ్వి బండలు పాతారు. కాలనీలో నివసిస్తున్న వారు ఓపెన్ సైట్‌లో ఎలా కాంపౌండ్ నిర్మిస్తున్నారని ప్రశ్నించగా.. తమకు 2004లోనే పట్టాలు ఇచ్చారని చెప్పారు. వైసీపీని అడ్డం పెట్టుకుని కొంత మంది లీడర్లు ఆ స్థలానికి పట్టాలు ఇచ్చినట్లు సృష్టించి, కబ్జా చేసేందుకు ఈ ఎత్తుగడులు వేసినట్లు తెలుస్తోంది. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడం, కోర్టుకు వెళ్లి స్టే తీసుకురావడం ఆదోనిలో అనవాయితీగా మారింది. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని కబ్జాదారులు దర్జాగా అక్రమ కట్టడాలు చేపడుతున్నా అధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. ఆదోనిలో చాలా చోట్ల ఆక్రమణలు పెరిగిపోయాయి. సాధారణంగా రస్తా, వంక పొరంబోకులో ఎటువంటి కట్టడాలు చేపట్టరాదు. ఇది చట్టరీత్యా నేరం. ఒకవేళ పట్టాలిచ్చినా అవి చెల్లవు. ఈ నిబంధనలను ఖాతరు చేయకుండా ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలను చేపట్టి, నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. భారీ స్థాయిలో పంచాయతీ, రెవెన్యూ అధికారులకు నజరానా ముట్టజెప్పడంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిస్తున్నాయి. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ స్థలాన్ని పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాలకు వినియోగించాలని పలువురు కోరుతున్నారు.

- బండలు పాతి ఆక్రమించుకోవడమే
- కబ్జా స్థలం రూ.4 కోట్ల పైమాటే

ఇది ఇలా ఉండగా.. ఆదోని పట్టణంతో పాటు, మండగిరి పంచాయతీలో ఆక్రమణలు అధికమయ్యాయి. గతంలో తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఆర్ఐ మండిగిరి పంచాయతీలో ఉన్న వంక పోరంపోకు భూములను గుర్తించి, వాటికి పట్టాలు ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ముందు కూడా అప్పటి ఎమ్మెల్యే సహాయ సహకారాలతో అధికార వైసీపీకి చెందిన కొంతమంది నాయకులకు పట్టాలు ఇచ్చినట్లు తెలుస్తున్నది. ఇందులో కొంత మంది విలేకరులు కూడా తమ పరపతిని ఉపయోగించి, కొంత నగదును ఆ రెవెన్యూ అధికారికి అందజేసి పట్టాలు తీసుకున్నట్లు సమాచారం. జిల్లా అధికారులు చొరవ చూపి ఇలాంటి అవినీతి అధికారులపై చర్యలు తీసుకొని అక్రమంగా ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. సర్వే నెంబర్ 480ఏ, 481లో 40 సెంట్ల ఓపెన్ సైట్‌లో 12 మందికి 2004లో పట్టాలు ఎలా ఇచ్చిందీ తెలియదని అన్నారు. దీనిపై విచారణ చేస్తున్నామని వివరణ ఇచ్చారు.

ఆక్రమణదారులు పాతిన బండలు



మీదివేములలో ఇరువర్గాల ఘర్షణ

ఓర్వకల్లు, జూన్ 7: మండలంలోని మీదివేముల గ్రామంలో టీడీపీ, వైసీపీ నాయకులు కార్యకర్తల మధ్య శుక్రవారం ఘర్షణ చోటు చేసుకుంది. రెండు రోజుల క్రితం టీడీపీ విజయంతో కార్యకర్తలు బాణాలు పేలుస్తుండగా.. బోయ, గొల్ల కులస్థుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో మనస్పర్థలు పెంచుకుని ఒకరికొకరు దాడులు చేసుకోవడంతో పదిమందికి పైగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. గ్రామాన్ని ఎస్ఐ రాజారెడ్డి సందర్శించి పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

హేమచంద్రారెడ్డి అక్రమాలపై విచారణ జరపాలి

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 7: ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలని శుక్ర వారం విజయవాడ కేంద్రంలోని ట్రైబల్ ప్రజా సమాఖ్య కార్యాల యంలో జరిగిన మీడియా సమావేశంలో టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు ఆకులప్ప నాయక్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ రాష్ట్రంలోని కొన్ని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలను యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు యూనివర్సిటీలుగా మార్చి కోట్లాది రూపాయలను దోచుకుంటున్నారని అన్నారు. యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఏఐసీటీఈ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించడం చట్ట వ్యతిరేకం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఐదేళ్ల పాలనలో దాదాపు రూ.150 కోట్ల అవినీతి అక్రమాలకు పాల్పడిన ప్రొఫెసర్ హేమచంద్రరెడ్డి, ఇతర అధికారుల మీద చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేసి ఉన్నత విద్యామండలిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, రాష్ట్ర కార్యదర్శి విష్ణు నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోయిన వైసీపీ వర్గీయులు

- మెజార్టీ తగ్గిందని టీడీపీ కార్యకర్తలపై దాడి
- ఐదుగురికి గాయాలు ● మూడు బైక్‌లు ధ్వంసం

కోడుమూరు (రూరల్), జూన్ 7: మండలంలోని గోరంట్ల మజరా కొత్తపల్లి గ్రామంలో వైసీపీ శ్రేణులు రెచ్చిపోయారు. టీడీపీ వర్గీయులపై దాడులకు తెగబడ్డారు. దీంతో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. 3 బైక్‌లు ధ్వంసం చేశారు. బాధితుల వివరాల ఇవి. శుక్రవారం సాయంత్రం వైసీపీ శ్రేణులు మద్యం సేవించి గ్రామ వీధుల్లో పెద్దశబ్దంతో బైక్‌లపై తిరిగారు. ఈలలు, కేకలతో జై జగన్ అంటూ నినాదాలు చేసుకుంటూ వెళ్లారు. దీంతో ఊర వాకిలి దగ్గర టీడీపీ వర్గీయుడు చిన్నమద్దిలేటి కలుగజేసుకుని ఎన్నికలు అయిపోయాయి కదా.. ఇప్పుడు ఇదంతా ఎందుకు అన్నందుకు దాడి చేసి కొట్టారు. ఈ ఘటనను దూరం నుంచి గమనించిన టీడీపీ కార్యకర్తలు విడిపించడానికి వెళ్లగా.. గ్రామంలో వైసీపీకి మెజార్టీ ఎక్కువ రాలేదని మూకుమ్మడిగా రాళ్లు, కట్టెలతో దాడి చేశారు. మూడు బైక్‌లను ధ్వంసం చేశారు. వైసీపీ దాడిలో టీడీపీ వర్గీయులు పసుల రాధాక్రిష్ణ, హోటల్ గిడ్డయ్య, మిషన్ గిడ్డయ్య, బాలమద్దిలేటి, చిన్నగిడ్డయ్య అనే ఐదుగురు గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టీడీపీ ప్రతిఘటనలో వైసీపీకి చెందిన ఒకరికి గాయాలు అయినట్లు తెలిసింది.



పగలగొట్టిన బైక్



గాయపడిన పసుల రాధాక్రిష్ణ

ఎంపీల సమావేశంలో బస్తిపాటి నాగరాజు

- చంద్రబాబును కలిసిన కర్నూలు ఎంపీ
- ప్రధాని మోదీతో సెల్ఫీ





కర్నూలు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో శుక్ర వారం జరిగిన ఎన్డీఏ ఎంపీల సమావేశానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరయ్యారు. పాత పార్ల మెంట్ భవనంలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశానికి టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్ర బాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌తో పాటు ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థులుగా పోటీ చేసి గెలిచిన 21 మంది ఎంపీలు హాజరయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి సమావేశంలో పాల్గొన్నారు. సమావేశానికి ముందు టీడీపీ అధినేత చంద్రబాబును బస్తిపాటి నాగరాజు కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీగా ఘన విజయం సాధించిన నాగరాజును చంద్రబాబు అభినందించారు. ఎంపీటీసీ నుంచి ఎంపీగా పార్లమెంట్‌లో అడుగు పెట్టావు... బాధ్యతగా పని చేసి కర్నూలు అభివృద్ధికి పాటుపడాలని బాబు సూచించారు. ఈ సమావేశం అనంతరం ప్రధాని మోదీతో నాగరాజు సెల్ఫీ దిగారు. తొలిసారిగా ఎంపీగా పార్లమెంట్‌కు వచ్చారు.. మంచిపేరు తెచ్చుకోవాలని ప్రధాని సూచించారు.

గాజులదిన్నెకు 1100 క్యూసెక్కుల వరద

ప్రస్తుతం 0.7 టీఎంసీల నీరు మాత్రమే నిలువ



ప్రాజెక్టులో ఉన్న నీరు

గోనెగండ్ల, జూన్ 7: గాజులదిన్నె ప్రాజెక్టుకు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా 1100 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 0.7 టీఎంసీల నీరు మాత్రమే ఉందని అధికారులు తెలుపుతున్నారు. ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 4.5 టీఎంసీలు అయితే ప్రస్తుతం 0.7 టీఎంసీ నీరు మాత్రమే ఉంది. ఈ ప్రాజెక్టు కింద 25వేల ఎకరాలు సాగు భూమి ఉంది. గత రెండేళ్లుగా జూన్ చివరి నాటికి ప్రాజెక్టులో వరద నీరు పుష్కలంగా వచ్చి చేరింది. ఈ ఏడాది జూన్ దాటినా ఇప్పటికీ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలలో వర్షాలు కురియక పోవడంతో వరద నీరు వచ్చి చేరలేదు. దీంతో ప్రాజెక్టు వెలవెల పోతోంది. ఈ ప్రాజెక్టు కింద డోన్, పత్తికొండ, క్రిష్ణగిరి తాగునీటి పథకాలకు నీరు సరఫరా అవుతున్నది. ప్రాజెక్టులో వరద నీరు వచ్చి చేరితేనే ప్రాజెక్టు కింద ఆయకట్టు భూములు పంట సాగుతో కళకళలాడుతాయి. వర్షం కోసం రైతులు ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు.

పుష్ప తరహాలో అక్రమ మద్యం వ్యాపారం

30 జాన్సన్ ఒరిజినల్ చాయిస్ బాక్స్‌లను పట్టుకున్న పోలీసులు



మద్యంను పట్టుకున్న పోలీసులు

గోనెగండ్ల, జూన్ 7: పుష్ప సినిమా తరహాలో మండలంలో అక్రమ మద్యం వ్యాపారం జరుగుతోంది. గూడ్స్ వాహనంలో వెనుక వైపు ఇతరులకు కనబడకుండా మద్యం బాక్స్‌లకు ప్రత్యేక ర్యాక్ తయారు చేసి వ్యాపారం చేస్తున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఇలాంటి ఏర్పాటు ఉన్న బొలేరో గూడ్స్ వాహనాన్ని గోనెగండ్ల, గంజహళ్లి గ్రామం మధ్య ఎల్లెల్సీ కాలువ దగ్గర పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. వాహనంలో ఉన్న పెద్దమరివీడు గ్రామానికి చెందిన మిన్నల్ల, పులకుర్తి గ్రామానికి చెందిన షేక్షావలి అక్రమ మద్యాన్ని, వాహనాన్ని వదలి పారిపోయారు. దీంతో పోలీసులు టీఎస్-15-యూబీ-0913 నెంబర్‌గల వాహనాన్ని, అందులో ఉన్న 30 జాన్సన్ ఒరిజినల్ చాయిస్ బాక్స్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పారిపోయిన ఇద్దరి పట్టుకుంటామని సీఐ రామకృష్ణయ్య తెలిపారు.

పెద్దాసుపత్రిలో ఈ-డిజిటల్ ఓపీ కౌంటర్

కర్నూలు(హాస్పిటల్), జూన్ 7: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఈ-డిజిటల్ ఓపీ కౌంటర్‌ను శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆసుపత్రికి ప్రతి రోజూ 3వేల మంది ఔట్ పేషెంట్లు వస్తుంటారని, వీరి కోసం నాలుగు ఓపీ కౌంటర్లు, పీడియాట్రిక్, గైనిక్ విభాగాల్లో ఓపీ కేంద్రాలున్నాయన్నారు. ఆయుష్మాన్ భారత్, ఈ-డీజిటల్ ఓపీ కౌంటర్‌ను ప్రారంభించామని, దీని వల్ల రోగులకు క్యూలైన్లలో ఎక్కువ సేపు నిలబడాల్సిన అవసరం ఉండదని తెలిపారు. స్మార్ట్ ఫోన్ ద్వారా డిజిటల్ స్కాన్ అండ్ షేర్ ద్వారా ఏటీఎం, ఫోన్‌పే, ఆభా యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఓపీ టోకెన్ నెంబర్ ద్వారా ఓపీ జనరేట్ అవుతుందన్నారు. ఇందులో కేవలం ఒక నిమిషం వ్యవధిలో ఓపీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసుపత్రిలో ఇవి కాకుండా అదనంగా మరో ఓపీ కౌంటర్లు త్వరలో ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డా. వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డా.పద్మ విజయశ్రీ, ఏఆర్ఎంవో డా. వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు డా. శివబాల, డా. కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



ఈ. డిజిటల్ ఓపీ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

మహిళ ఆత్మహత్య

అత్తింటివారే చంపారని తల్లిదండ్రుల ఆరోపణ



కైరున్నిసా (ఫైల్)

పగిడ్యాల, జూన్ 7: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో అనుమానాస్పద స్థితిలో మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శుక్ర వారం జరిగింది. గ్రామానికి చెందిన దూదేకుల కాసీం, సాలమ్మల కుమారుడు సలీమాలిక్‌తో కర్నూలు జిల్లా దేవమాడ గ్రామానికి చెందిన పెద్ద శాలు, ఖాసీంబీల కుమార్తె కైరున్నిసా (26)కు ఐదేళ్ల కింద పెళ్లయిందది. వివాహ సమయంలో కట్నం కింద రూ. 50వేలు, 8 తులాల బంగారం ఇచ్చారు. గురువారం రాత్రి కైరున్నిసా తల్లిదండ్రులు ఫోన్ చేసి కూతురిని పుట్టింటికి తీసుకొనిపోయేందుకు వస్తామని అల్లుడితో చెప్పారు. అయితే ఆయన రావద్దని చెప్పాడు. ఆ తర్వాత ఏం జరిగిందోగాని తెల్లవారుజామున గదిలో కైరున్నిసా ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కైరున్నిసా ఎంత సేపటికి బయటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఈ విషయాన్ని మృతురాలి తల్లిదండ్రులకు తెలియజేశారు. వారు గ్రామానికి వచ్చి చూసి తమ కూతురిని అత్తరింటివాళ్ళే చంపి ఉరివేసుకున్నట్లు చిత్రీకరిస్తున్నారని అన్నారు. పెళ్లి అయినప్పట్టి నుంచి తమ కూతురిని అత్తింటి వాళ్ల నిత్యం వేధిస్తున్నారని ఆరోపించారు. ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని మహిళ ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. భర్త సలీమా మాలిక్, అత్త సాలమ్మలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు.

15న జిల్లా స్థాయి విలువిద్య ఎంపిక పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 7: స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు అండర్-10, 13, 15 విభాగాలలో జిల్లా స్థాయి విలువిద్యలో ఎంపిక పోటీలు, టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు జిల్లా విలువిద్య సంఘం కార్యదర్శి కె.నాగరత్నమయ్య శుక్రవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి విలు విద్య పోటీల్లో పాల్గొంటారని అన్నారు. వివరాల కోసం 9393855460, 9032104158 నెంబర్లను సంప్రదించాలన్నారు.

బ్రెయిన్ ట్యూమర్ సైలెంట్ కిల్లర్

- ఏటా పెరుగుతున్న కేసులు
- సకాలంలో గుర్తించకపోతే ముప్పు
- నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే



కర్నూలు(హాస్పిటల్), జూన్ 7: మానవ శరీరంలో మెదడు కీలకమైన అవయవం. బ్రెయిన్ ట్యూమర్ సైలెంట్ కిల్లర్‌గా మారుతోంది. ఏటా కొత్తగా 12వేల మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ఈ జబ్బు ప్రాణాలు తీసే వరకు బయట పడడం లేదని, బ్రెయిన్ ట్యూమర్ వచ్చిన వారిలో 3వ వంతు మంది ఐదేళ్లలోపే మరణిస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. అవగాహన లోపం వల్ల మెదడులోని కణితులను ప్రారంభ దశలో గుర్తించలేకపోతున్నారు. ముఖ్యంగా 25 నుంచి 35 ఏళ్ల లోపు వారే ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన కల్పించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా జూన్ 8న వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే నిర్వహిస్తుంది.

ఈ ఏడాది థీమ్: ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్‌పై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒక కొత్త లక్ష్యం ప్రకటించుకుంది. ఈ ఏడాది అందరం కలిసి మెదడు కణితుల ద్వారా ప్రభావితమైన వారి జీవితాల్లో మార్పు చేయవచ్చు అన్న నినాదంతో ముందుకెళ్తుంది.

లక్షణాలు :

- తలనొప్పి
- తలలో ఒత్తిడి
- ఉదయం సమయంలో తీవ్రమైన తలనొప్పి
- వికారం, వాంతులు
- కళ్ల సరిగ్గా కనబడకపోవడం
- కాళ్ల, చేతులు బలహీనపడటం

● **మెదడు పనితీరు మందగిస్తుంది:** మెదడులో సాధారణంగా పాత కణజాలాలు పోయి కొత్త కణజాలాలు సృష్టి నిరంతరంగా జరుగుతుంది. ఈ ప్రక్రియలో పాత కణజాలాలు పూర్తి పోకుండా మిగిలిపోతే బ్రెయిన్ ట్యూమర్ (మెదడు కణతులు) వచ్చే అవకాశముంది. ఈ కణితులను ఆలస్యం చేస్తే ట్యూమర్ కణాలు వాటి సంఖ్యను పెంచుకుంటూ పోతాయి. ఫలితంగా ట్యూమర్ సైజు పెరిగి ప్రమాకరంగా మారుతుంది.

● **మెదడులో కణితుల రకాలు :** మెదడులోని కణజాలాల్లో ఏర్పడితే దాన్ని బ్రెయిన్ ట్యూమర్ అంటారు. ఇవి రెండు రకాలు. ప్రైమరీ, సెకండరీ బ్రెయిన్ ట్యూమర్‌లు. ప్రైమరీ బ్రెయిన్‌ను నాలుగు విభాగాలుగా విభజించాలి. సెకండరీ బ్రెయిన్ ట్యూమర్లు, శరీరంలో వివిధ విభాగాల్లో సోకుతాయి. అవి రక్తంలో ప్రవేశించి మెదడులో చేరుతాయి.దీని ద్వారా మెదడులో కణితులు ఏర్పడుతాయి. రేడియేషన్ ద్వారా కూడా ఈ కణతులు ఏర్పడుతాయి.



ఆసుపత్రిలో మెరుగైన చికిత్స



న్యూరో సర్జరీ ఓపీ ప్రతి బుధ, శనివారాల్లో ఉంటుంది. ప్రతి ఓపికి 250 నుంచి 350 మంది రోగులు వస్తుంటారు. ఈ ఓపికి మూడు నుంచి నాలుగు కేసులు వస్తుంటాయి. ఎంఆర్ఐ, సిటీ స్కాన్ పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారించి చికిత్స అందిస్తున్నాం.

- డా.మోహన్ శశాంక్, న్యూరోసర్జన్, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి

బ్రెయిన్ ట్యూమర్ ప్రమాదకరం



బ్రెయిన్ ట్యూమర్ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. దీర్ఘకాలం పాటు రేడియేషన్‌కు గురయ్యే వ్యక్తులు, పొగతాగే వ్యక్తులకు బ్రెయిన్ ట్యూమర్ సమస్య తీవ్రంగా ఉంటుంది.

- డా.విశ్వకుమార్, న్యూరోసర్జన్, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

మెదడు కణతులను బట్టి చికిత్స



మెదడులో ఏర్పడిన కణితులను గ్రేడ్-1, 2, 3, 4 విభాగాలుగా విభజించి చికిత్స అందిస్తారు. కణితుల స్థానంపై ఆధారపడి వైద్యం ఉంటుంది. గ్రేడ్ 1, 2 లో ఉన్న కణితులు 3 సెం.మీలు ఉంటే తక్కువగా ఉండే రేడియేషన్ ద్వారా తగ్గించవచ్చు.

- డా.ఎస్.సుమంత్ కుమార్, న్యూరోసర్జన్, కిమ్స్ హాస్పిటల్, కర్నూలు

గోశాలకు మోటారు పంపు విరాళం



మోటారు పంపునకు పూజలు చేస్తున్న వేదపండితులు

మహానంది, జూన్ 7: మహానంది దేవస్థానంలో గోవులకు అవసరమైన గడ్డి పెంచేందుకు నీటిని సరఫరా చేసే మోటారు పంపును దాతలు విరాళంగా అందజేసినట్లు వేదపండితులు రవిశంకరఅవధాని తెలిపారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన బొగ్గరపు సుబ్రహ్మణ్యం, రెడ్డి సుమిత్ర దంపతులు రూ.లక్ష విలువచేసే మోటారు పంపును శనివారం విరాళంగా అందజేసినట్లు ఆయన తెలిపారు. కొత్త మోటారుకు వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వర శర్మ, హనుమంతు శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శరబయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజ్యాధికార పాశుపత రుద్రాభిషేకం

నంద్యాల కల్చరల్, జూన్ 7: నంద్యాల ఆర్టీసీ బస్టాండు పక్కన వెలిసిన నీలకంఠేశ్వర మధువర్ణ బాణలింగ మందిరంలో శనివారం ఉదయం 7 గంటలకు రాజ్యాధికార పాశుపత రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు బ్రహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నగరదోణ సుధీర్ తెలిపారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, నంద్యాల ఎమ్మెల్యే ఎన్‌ఎండీ ఫరూక్, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు మంత్రిత్వ శాఖలో పదవులు పొందాలనే సంకల్పంతో రాజ్యాధికార పాశుపత రుద్రాభిషేకం యాదవల్లి కార్తికేయశర్మ, మాడుగుల నాగేంద్ర శర్మ వేదమంత్రాలతో రుద్రాభిషేకం చేపడుతున్నట్లు తెలిపారు. బ్రహ్మణ సేవా సమాఖ్య నిర్వాహకులు రావినూతల దుర్గా ప్రసాద్, శుక్లాస్వామి సహకారంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తడిసిన నిత్యావసరాలు



కడుమూరులో తడిసి ముద్దయిన నిత్యావసరాలు

మిడుతూరు, జూన్ 7: మండలంలోని కడుమూరు గ్రామంలో గోడౌన్‌లోకి వరద నీరు చేరి ప్రజలకు పంపిణీ చేసే నిత్యవసర సరుకులు తడిసి ముద్దయ్యాయి. డిప్యూటీ తహసీల్దార్ షా నవాజ్ కడుమూరు గ్రామం చేరి గోడౌన్‌ను పరిశీలించారు. డీలర్ కిశోర్‌కు చెందిన 33 క్వింటాళ్ల బియ్యం, రెండున్నర క్వింటాళ్ల చెక్కర, 30 కిలోల బెల్లం, 30 కిలోల రాగి పిండి తడిసి ముద్ద అయినట్లు ఆయన తెలిపారు. దీనిపై ఉన్నత అధికారులకు నివేదిక పంపి వాటి స్థానంలో నిత్యవసర సరుకులు వచ్చేలా చర్యలు చేపట్టనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మిడుతూరు, జూన్ 7: తలముడిపి గ్రామంలో ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందారు. వివరాలివి.. కురువ సంజీవ్ కుమార్‌కు, మహేశ్వరికి ఐదేళ్ల క్రితం వివాహమైంది. మహేశ్వరి(24) బుధవారం సాయంత్రం కడుపు నొప్పి తాళలేక ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ఆమెను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మహిళ తల్లి పుల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్ మోహన్ తెలిపారు. మహేశ్వరికి కొడుకు, కూతురు ఉన్నారు.

'ఐక్య పోరాటాలతోనే కార్మిక సమస్యలు పరిష్కారం'

ఆత్మకూరు, జూన్ 7: ఐక్య పోరాటాలతోనే కార్మిక సమస్యల పరిష్కారం లభిస్తుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం అన్నారు. శుక్రవారం ఆత్మకూరులోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, నిరుద్యోగులు ఐక్యంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు రణధీర్, రామ్‌నాయక్, జబీవుల్లా, రాముడు, ముర్తుజావలి, ముబారక్, ప్రభావతి, మేరమ్మ, శాంతకుమారి ఉన్నారు.

'ప్రజా తీర్పును గౌరవిస్తాం'

నందికొట్కూరు, జూన్ 7: నందికొట్కూరులో టీడీపీని ప్రజలు గెలిపించారని, వారి తీర్పును గౌరవిస్తామని వైసీపీ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన తుది శ్వాసవరకు నందికొట్కూరు ప్రజల కోసం, జగన్మోహన్‌రెడ్డి కోసం, వైసీపీ పార్టీ కోసం పని చేస్తానన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే లబ్బివెంకటస్వామి, ఎక్కలదేవి చంద్రమౌళి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వేధిస్తే ఇలాంటి ఫలితాలే పునరావృతం'

నంద్యాల (నూనెపల్లె), జూన్ 7: ఉద్యోగ, ఉపాధ్యాయుల మనోభావాలను కక్ష సాధింపు చర్యలు చేపట్టే ఏ ప్రభుత్వానికైనా ఇలాంటి ఫలితాలు పునరావృతమవుతాయని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మౌలాలి అన్నారు. శుక్రవారం నంద్యాలలోని ఎస్టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో నూతన ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో కలిసి పని చేస్తుందని ఆయన ఆశా భావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాలకృష్ణ, సుబ్బయ్య, నాగేంద్రకుమార్, సుబ్బరాయుడు, తదితరులుపాల్గొన్నారు.

'సుదీర్ఘ కాలం ప్రజా సేవలో ఉండాలి'

నంద్యాల టౌన్, జూన్ 7: ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు, అధికారంలోకి వస్తున్న నాయకులు సుదీర్ఘకాలం ప్రజా సేవలో రాజకీయ జీవితాన్ని కొనసాగించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకులు ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రతి సందర్భంలో ప్రజలు తమ విజ్ఞతతో ఓటు అనే వజ్రాయుధంతో విలక్షణమైన తీర్పు నిస్తున్నారని గుర్తుచేశారు. పాలకులంతా ప్రజల భావ ప్రకటనా స్వేచ్ఛను గౌరవిస్తూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడానికి తగిన కార్యాచరణను చేపట్టాలని అన్నారు. ప్రజాస్వామ్యయుతంగా పాలన కొనసాగించి సుదీర్ఘకాలం ప్రజలకు సేవ చేయాలని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాణ్యం, జూన్ 7: మండలంలో శనివారం 4 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ పుల్లయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాటాడుతూ స్థానిక విద్యుత్ కేంద్రంలో విద్యుత్ పనుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు.

సంబరాల్లో తెలుగు తమ్ముళ్లు

- కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్న నాయకులు, కార్యకర్తలు
- ఆలయాల్లో పూజలు
- టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్న పార్టీ శ్రేణులు



సంగమేశ్వరుడిని దర్శించుకుంటున్న మాండ్ర శివానందరెడ్డి దంపతులు, ఎమ్మెల్యే జయసూర్య



నందికొట్కూరులో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు



పాణ్యం: కొండజూటూరులో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

నందికొట్కూరు, జూన్ 7: నందికొట్కూరు ఎమ్మెల్యేగా జయసూర్య గెలవడంతో పట్టణానికి చెందిన బీసీ సెల్ అధ్యక్షుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం పట్టణంలోని సుంకులమ్మ దేవాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నంద్యాలలోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఆయన సతీమణి ఉమాదేవి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ప్రారంభించారు. మాండ్ర మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమం చేయడం అభినందనీయమన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు త్వరలోనే చంద్రబాబు నాయుడు అన్నా క్యాంటీన్‌లను రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభిస్తారన్నారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, పలుచాని మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్తపల్లి, జూన్ 7: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేర్చడమే తమ లక్ష్యమని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శుక్రవారం మండలంలోని సప్తనదుల సంగమేశ్వరం, కొలనుభారతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆయా ఆలయాల పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ, శ్రీనివాస శర్మలు పూర్ణకుంభం స్వాగతం పలికారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత మొదటిసారిగా కొత్తపల్లి మండలానికి మాండ్ర శివానందరెడ్డి దంపతులు, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య రావడంతో వీరికి సంగమేశ్వరంలో మండల నాయకులు ఘనస్వాగతం పలికారు. నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, నారపురెడ్డి, లింగస్వామిగౌడు, జడ్.వెంకటరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనాథరెడ్డి, పలుచాని మహేశ్వరరెడ్డి, సీలం లింగన్న, డీలర్ వెంకటస్వామి, పుల్లయ్యగౌడు, జానాల సుధాకర్, శివారెడ్డి, బుచ్చిరెడ్డి, జానకి రాముడు, నాగేశ్వరరావు యాదవ్, రఫీ, మల్లయ్య చంద్రారెడ్డి, స్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని కంబాలపల్లి గ్రామంలోని శివాలయంలో టీడీపీ నాయకులు ఆళ్లగడ్డ హరిసర్వోత్తమరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం గ్రామ టీడీపీ నాయకులు పాపిరెడ్డి ఆహ్వానం మేరకు అభిషేకాలు, బిల్వార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ నాయకులు శివ, ఈశ్వరరెడ్డి, శివ, రమణ, లక్ష్మీనారాయణ, నబీరసూల్, లింగస్వామి, మల్లికార్జున, మద్దిలేటి, జలాల్‌బాషా అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నంద్యాల కల్చరల్: రాష్ట్రం, కేంద్రంలోనూ ఎన్డీఏ కూటమి విజయం సాధించడం పట్ల బీజేపీ నంద్యాల జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి మధు ఆధ్వర్యంలో నంద్యాల బీజేపీ కేంద్ర ఎన్నికల కార్యాలయంలో కేక్ కట్ చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కశెట్టి కృష్ణమూర్తి, బాలముని, మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు స్వాతి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, గురుబ్రహ్మం, చంద్ర, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



గౌరు దంపతులను కలిసిన వైసీపీ నాయకుడు చంద్రశేఖరరెడ్డి



పాములపాడు: కంబాలపల్లిలో శివాలయంలో..

పాణ్యం: టీడీపీ, జనసేన, బీజేపీ ఘనవిజయం పట్ల కొండజూటూరులోని లింగమయ్యస్వామి ఆలయంలో శుక్రవారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో టెంకాయలు కొట్టి, రాష్ట్రంలో కూటమి మంచిపాలన అందించాలని దేవుని ప్రార్థించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగనారాయణ, నాయకులు పుప్పాల సురేంద్ర, వేణుగోపాల్, కోటయ్య, మురళీ, నాగిరెడ్డి, చిన్నపుల్లయ్య, సుబ్బయ్య, గంగయ్య, విశ్వనాథ్, ఎల్లాసుబ్బయ్య, జనసేన, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను శుక్రవారం మండల వైసీపీ నాయకుడు, పాణ్యం ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖరరెడ్డి కలిసి అభినందనలు తెలిపారు. అలాగే మండలంలోని టీడీడీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గౌరు దంపతులను పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో నందికొట్కూరు టీడీపీ ఇంచార్జి గౌరు వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ పాలం హరిత, పాలం సురేష్‌రెడ్డి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గడివేముల: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో బిలకలగూడురు గ్రామంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మాజీ కో-ఆప్షన్ మెంబర్ రఫిక్, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, జయనాగేశ్వర్ రెడ్డి, జయంత్‌రెడ్డి, శ్రీను, ఫరూక్ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు.

బండిఆత్మకూరు: నారాయణాపురం గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవాలు నిర్వహించారు. నందగారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శ్రీశైలం ఎమ్మెల్యేగా గెలిచిన బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతూ గెలుపుపై కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నంద్యాలలోని బీజేపీ కార్యాలయంలో సంబరాలు



బండిఆత్మకూరు: నారాయణాపురంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు



గడివేముల: బిలకలగూడూరు గ్రామంలో కేక్ కట్ చేస్తున్న సత్యనారాయణరెడ్డి

ఆగని ఇసుక దందా

- యథేచ్ఛగా తరలిస్తున్న అక్రమార్కులు



శాతనకోట తుంగభద్ర నదీ పరివాహక ప్రాంతంలో అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక డంపు



ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

నందికొట్కూరు రూరల్, జూన్ 7: నందికొట్కూరు మండలంలోని శాతన కోట గ్రామం వద్ద తుంగభద్ర నది తీర ప్రాంతంలో అక్రమంగా ఇసుక డంపు ఏర్పాటు చేసి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా అల్లూరు గ్రామం, నందికొట్కూరు మీదుగా గ్రామాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా అధికారులకు తెలిసే జరుగుతుందని ఆయా గ్రామస్థులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. అయినా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గత నెల 27 వతేదీన నందికొట్కూరు మండల పరిధిలోని తుంగభద్ర నదీ తీరం వెంబడి గల శాతన కోట గ్రామంలో వున్న ఇసుక తిన్నెలను 7 శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇకపై కూడా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మైనింగ్ శాఖ డీఎంజీవో రామచంద్ర, సెబ్ సీఐ సీతారామిరెడ్డి, ఆత్మకూర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌ఎంరెడ్డి, గ్రౌండ్ వాటర్ ఏడీ రఘురాం గౌడ్, శాతనకోట వీఆర్‌వో శ్రీనివాసులు. ఎస్ నాగార్జున, ఇతరు అధికారులు పరిశీలించి హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం రెండు ట్రిప్పర్లను, ఒక ఎక్స్‌కవేటరును స్వాధీనం చేసుకొని ఎనిమది మందిపై కేసు నమోదు చేశామని చెప్పారు. అయితే ఇసుక అక్రమ రవాణ ఆగలేదు. పట్టపగలే ఇసుకను అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం మారినా వైసీపీ నాయకుల దోపిడీ మాత్రం ఆగడం లేదు. వీఆర్వో శ్రీనివాసులును, బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ నాగార్జునను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని, విచారిస్తామని చెప్పారు.

భారీ వర్షం.. తీవ్ర నష్టం

- కోతకు గురైన రహదారులు
- వంతెనలపై పొంగి ప్రవహించిన నీరు



పీరుసాహెబ్ పేట బ్రిడ్జి సమీపంలో కోతకు గురైన రోడ్డు



మిడుతూరు కాకిలేరు బ్రిడ్జి దగ్గర కోతకు గురైన రహదారి



కరివేన డీపాల్ స్కూల్ వద్ద కేజీ రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

మిడుతూరు, జూన్ 7: మిడుతూరు మండలంలో గత రెండు రోజుల నుంచి కుండ పోత వర్షం కురియడంతో పలు చోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. మండలంలోని పీరుసాహెబ్ పేట గనేట్ల బ్రిడ్జి దగ్గర, మిడుతూరు కాకిలేరు బ్రిడ్జి దగ్గర ఉధృతంగా వరద ప్రవాహం ప్రవహించడంతో రోడ్డు కోతకు గురైంది. ఈ రహదారుల వెంబడి పలు ప్రాంతాలకు రాకపోకలు సాగుతుంటాయి. రోడ్లు కోతకు గురవ్వడంతో ముఖ్యంగా రాత్రుల్లో ప్రమాదాలు జరిగే జరగవచ్చాని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మిడుతూరు: మిడుతూరు మండలంలో గురు, శుక్రవారాల్లో వర్షం పడింది. 36.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఓర్వకల్లు, ఉయ్యాలవాడ ఎగువ ప్రాతంలో కురిసిన వర్షం కారనంగా కుందూ, కాకిలేరు వాగులు వంతెనలు ఎక్కి ప్రవహించాయి.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. 38.8 మి.మీ. వర్షపాతం నమోదు అయింది. ఎగువ ప్రాంతాల్లో కురిషిన వర్షానికి కాకిలేరు వాగు, ఇసుకవాగు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో పారుమంచాల ప్రధాన రహదారిపై ఇసుకవాగు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు మండలంలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో కరివేన గ్రామ శివార్లలోని డీపాల్ స్కూల్ వద్ద కేజీ రహదారిపై వర్షపు నీరు పైభాగం నుంచి ప్రవహించడంతో వాహనదారులు రోడ్డు దాటేందుకు పలు ఇబ్బందులు పడ్డారు. తిరిగి జాతీయ రహదారి అధికారులు చొరవ తీసుకుని అక్కడి ముళ్ళ కంపలు తొలగించడంతో జాతీయ రహదారిపై నీటి ప్రవాహం లేకుండా చేయడంతో యథావిధిగా ప్రయాణాలు కొనసాగాయి. మండలంలో కురిసిన వర్షంతో గ్రామాల్లోని లోతట్టు కాలనీల్లోని ఇళ్ళలోకి వర్షపు నీరు చేరడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు గ్రామాల్లో నీరు రోడ్లపై నిలిచింది.



వంతెన ఎక్కి ప్రవహిస్తున్న కాకిలేరు వాగు నీరు



పారుమంచాలలో ఇసుకవాగు బ్రిడ్జిపై ప్రవహిస్తున్న నీరు

'30 శాతం సబ్సిడీతో కంది విత్తనాలు'

గడివేముల, జూన్ 7: మండలంలోని ఆర్‌బీకేల్లో సబ్సిడీపై కంది విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి హేమసుందర్ రెడ్డి తెలిపారు. ఎల్ఆర్‌జీ-51, ఎల్ఆర్‌జీ-105 రకాల కంది విత్తనాలు 30 శాతం సబ్సిడీతో ఇస్తున్నామని చెప్పారు. కేజీ ధర రూ.140 ఉండగా రైతులు రూ.98 చెల్లించాలన్నారు. కావాల్సిన వారు ఆధార్, పాసు పుస్తకంతో ఆర్‌బీకేలో సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

'గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి'

గడివేముల, జూన్ 7: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. ఏప్రిల్ 29 నుంచి ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారం ముగియడంతో విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 40 రోజుల విజ్ఞాన శిబిరంలో పిల్లలకు కథల పుస్తకాలు చదివించడం, చెస్, క్యారంబోర్డు ఆడించినట్లు తెలిపారు.

'వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

ఆత్మకూరు రూరల్, జూన్ 7: సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని బైర్లూటి వైద్యాధికారి పవన్‌కుమార్ ప్రజలకు సూచించారు. అమలాపురం చెంచుగూడెంలో శుక్రవారం ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి చికిత్సలు నిర్వహించి, వ్యాదుల నివారణపై చెంచులకు అవగాహన కల్పించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సీహెచ్‌వో రజిత,హెల్త్ అసిస్టెంట్ మహేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

గడివేముల, జూన్ 7: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. ఖాళీగా ఉన్న సీట్లను ప్రవేశ పరీక్ష నిర్వహించి భర్తీ చేస్తున్నామని అన్నారు. విద్యార్థులు టీసీ, స్టడి సర్టిఫికెట్‌తో పాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డుతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఆధారంగా సీట్లు కేటాయిస్తామని అన్నారు.

'జీవో నెంబరు 117ను రద్దు చేయాలి'

నంద్యాల (నూనెపల్లె), జూన్ 7: గత ప్రభుత్వం అమలు చేసిన జీవో నెంబరు 117ను నూతన ప్రభుత్వం రద్దు చేసి ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ఏపీయూఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారయణ కోరారు. శుక్రవారం సంజీవనగర్‌లో జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అనాలోచితంగా జీవో 117 బలవంతగా అమలు పరచడంతో వేలాది ఉపాధ్యాయుల పోస్టులు రద్దయ్యాయన్నారు. నూతనంగా ప్రభుత్వం సమస్యల పరిస్కారానికి కృషి చేయాలని కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు మల్లికార్జున శ్రీపతి బాలయ్య, సురేష్ బాబు పాల్గొన్నారు.

వాగును తలపిస్తున్న సర్వీసు రోడ్డు



పాణ్యం జాతీయ సర్వీసు రోడ్డుపై నిలిచిన నీరు

పాణ్యం, జూన్ 7: పాణ్యం జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై గత వారం రోజులుగా వర్షం నీరు నిలిచి వాగును తలపిస్తోంది. ఉండడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నీటి కింద గుంతలు ఉండడంతో ద్విచక్రవాహనదారులు నిత్యం కిందపడుతూ గాయాలపాలవుతున్నారు. నీరు ఎక్కడికీ కదలకపోవడంతో సమస్య జటిలంగా మారింది. ఇప్పటికే గ్రామంలో ఈ నీటి సమస్యపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై కర్నూలు, హైదరాబాద్, బెంగళూరు, అనంతపురం తదితర దూరప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు, కార్లు, భారీ లారీలతో పాటు నిత్యం ఆటోలు వెళ్తుంటాయి. నీరు నిలిచినా హైవే అధికారులకు చీమకుట్టినట్టయినా లేకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నీటిని రోడ్డుపై లేకుండా చేయాలని కోరుతున్నారు.

యాగంటిలో పూజలు



యాగంటికి పాదయాత్రగా వెళ్తున్న సర్పంచ్ దొనపాటి వరలక్ష్మి, టీడీపీ కార్యకర్తలు

బనగానపల్లె, జూన్ 7: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో మండలంలోని ఎర్రగుడి గ్రామానికి చెందిన టీడీపీ సర్పంచ్ దొనపాటి వరలక్ష్మి, దొనపాటి భాస్కర్‌రెడ్డి యాగంటిలో పూజలు చేశారు. శుక్రవారం బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డికి మంత్రి పదవి రావాలని యాగంటికి పాదయాత్రగా వెళ్లారు. టీడీపీ నాయకులు శివసుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ గడ్డం సుధాకర్‌ఎడ్డి, గడ్డం వెంకటసుబ్బారెడ్డి, గడ్డం రమేశ్‌రెడ్డి అల్తాఫ్, అరీఫ్ తదితర 150 మంది వారి వెంట ఉన్నారు. అనంతరం యాగంటిలో ఉమామహేశ్వరస్వామికి సమీపంలోని మారునీళ్ల చెలిమ వద్ద పార్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

పెట్నికోటలో సంబరాలు



తెలుగు యువత అధ్యక్షుడ్ని అభినందిస్తున్న టీడీపీ శ్రేణులు

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 7 : జిల్లా పరిషత్ చైర్మన్ సొంత పంచాయతీ పెట్నికోటలో టీడీపీకి మెజార్టీ రావడం టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం గ్రామంలో టీడీపీ మండల తెలుగు యువత అధ్యక్షుడు గొంగటి హుస్సేన్‌రెడ్డి గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గొర్విమానుపల్లె టీడీపీ నాయకులు మూలే హుస్సేన్‌రెడ్డి, పేట్నికోట నాయకులు నారాయణరెడ్డి, రవీంద్ర, నాగిరెడ్డి, ప్రసాదు, రామాంజనేయరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని బెలుంశింగవరం గ్రామంలో టీడీపీ విజయం పట్ల సంబరాలు నిర్వహించారు. టీడీపీ నాయకులు నాగేశ్వరరెడ్డి, పెద్దరామ సుబ్బారెడ్డి, శంకరరెడ్డి, కట్టుబడి రామ్మోహన్, పక్కీర, విశ్వనాథ, వరదరాముడు తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక పూజలు



దర్గా వద్ద ఫతేహాల్ సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె , జూన్ 7 : బనగానపల్లె పట్టణంలోని పాతబస్టాండ్‌లో హజరత్‌మీర్‌హాశంవలి రమ్మతుల్లా దర్గా వద్ద ఎమ్మెల్యేగా బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ ప్రత్యేక పూజలు చేశారు. బీసీ జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో శుక్రవారం ఇందిరమ్మ మొక్కు చెల్లించుకున్నారు. బీసీ ఇందిరమ్మ దర్గా వద్ద ఫతేహాలు సమర్పించారు. ముజవర్ అహమ్మద్‌హుసేన్ మాట్లాడుతూ బీసీకి మంత్రిపదవి రావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నియాజ్, అమీర్‌జాన్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయ నాయకుల మాయలో పడొద్దు



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు నక్కి హరి

డోన్(రూరల్), జూన్ 7: రాజకీయ నాయకుల మాయలో పడి యువత తమ ఉజ్వల భవిష్యత్తును పణంగా పెట్టవద్దని డీవైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు నక్కి హరి, హబీబ్ బాషా పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కొందరు రాజకీయ నాయకులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం యువతను రెచ్చగొడుతుంటారని, యువత వీరి పట్ల సమర్థవంతంగా ఉండాలని కోరారు.

ఘనంగా చౌడేశ్వరీమాతకు పల్లకీ సేవ

బనగానపల్లె, జూన్ 7: బనగానపల్లె మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం చౌడేశ్వరీ మాత పల్లకీసేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో అమ్మవారిని ఊరేగించారు. భక్తులు పల్లకిసేవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

మతిస్థిమితం లేని మహిళను కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు



షేక్ సమీనను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్ఐ కిరణ్‌బాబు, శివమ్మ

అవుకు, జూన్ 7 : అవుకు మండలం శివవరం గ్రామంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న షేక్ సమీనా అనే మహిళను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివమ్మ శుక్రవారం తెలిపారు. షేక్ సమీనా మతిస్థిమితం లేకుండా గ్రామంలో తిరుగుతూ ఉండటం గ్రామస్థులు అంగన్‌వాడీ కార్యకర్త సరోజకు తెలపమన్నారు. ఆమె అవుకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై కిరణ్‌బాబు ఎంక్వైరీ చేసి కర్నూలు తాలుకా యూపీఎస్‌లో మిస్సింగ్ కేసు నమోదు అయినట్లు తెలుసుకొని ఆమె కుటుంబ సభ్యులు సలీమాబీ, సోహిల్, ముజిమిల్‌ను అవుకు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అప్పగించినట్లు తెలిపారు.

కోట్ల ఆశయాలను నెరవేరుద్దాం

● **ఎన్టీఆర్, కోట్ల విగ్రహాలకు క్షీరాభిషేకం**



కోట్ల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

డోన్, జూన్ 7: డోన్ ఎమ్మెల్యేగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి విజయం సాధించిన సందర్భంగా శుక్రవారం పట్టణంలోని దివంగత ఎన్టీఆర్, దివంగత కోట్ల విజయభాస్కర్ రెడ్డి, కేఈ మాదన్న విగ్రహాలకు టీడీపీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, తదితరుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్, కోట్ల, కేఈ మాదన్న విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్, కోట్ల విజయభాస్కర్ రెడ్డి ముఖ్యమంత్రులుగా పని చేసిన కాలంలో తెలుగు ప్రజల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. డోన్‌లో టీడీపీ జెండాను ఎగురవేసి ప్రజలు చంద్రబాబుకు కానుకగా ఇచ్చారన్నారు. కోట్ల ఆశయాలను నెరవేర్చేలా డోన్ నియోజకవర్గంలో ప్రజలకు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పాలన అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు, ప్యాపిలి మండల అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, కేఈ శ్యాం, గోవిందరెడ్డి, బాష్యం శ్రీధర్, తోట మనోహర్, తాడూరు వెంకటరమణయ్య, బీజేపీ నాయకులు వడ్డె మహరాజ్, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



డోన్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీనాయకులు

అంబరాన్నంటిన టీడీపీ సంబరాలు

డోన్(రూరల్), జూన్ 7: రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం, ఎన్డీయే కూటమిలో కీలక నాయకుడుగా మారడంతో డోన్‌లో టీడీపీ సంబరాలు మిన్నంటుతున్నాయి. పట్టణంలోని ఏపీ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి స్వీట్లను పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి టీడీపీ నాయకులు సీలం భాస్కర్ నాయుడు ఆధ్వర్యంలో బీసీ నాయకులు సంబరాలు జరుకున్నారు. ఈ సందర్భంగా సీలం భాస్కర్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలనతో పాటు అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందనున్నాయని అన్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో రోడ్ల మీదకు వచ్చి టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందడి చేశారు.

అందరి సహకారంతోనే టీడీపీ విజయం



చంద్రపల్లిలోని అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు యాదవ్, నాయకులు

ప్యాపిలి, జూన్ 6: అందరి సహకారంతోనే డోన్ నియోజకవర్గంలో టీడీపీ విజయం సాధించిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నారు. శుక్రవారం మండలంలోని చంద్రపల్లి గ్రామంలో టీడీపీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావుయాదవ్ మాట్లాడుతూ వైసీపీ అరాచకాలకు విసుగు చెందిన ప్రజలు ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసిన కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. పార్టీ శ్రేణులకు ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉంటామన్నారు. ఎన్నికల్లో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తారన్నారు. అనంతరం టీడీపీ గెలుపొందడంతో ఆయన అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అలేబాదు పరమేష్, రామ్మోహన్ యాదవ్, బావిపల్లి లింగన్న, నాగేంద్ర, రాంపురం నాగేశ్వరరావు, సురేంద్రగౌడు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అభినందనలు



టీడీపీ నాయకులు పోలూరు శ్రీనివాసులు, రాఘవరావు, సుధాకర్‌ను గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

బేతంచెర్ల, జూన్ 7 : డోన్ ఎమ్మెల్యేగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి విజయానికి కృషి చేసిన టీడీపీ సీనియర్ నాయకులు పోలూరు శ్రీనివాసులు, పోలూరు రాఘవరావు, పోలూరు చైతన్య, టీడీపీ పట్టణ సమన్వయ చైర్మన్ సుధాకర్ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. శుక్రవారం రాఘవరావు మాట్లాడుతూ అవినీతి అరాచక పాలనకు, ఇసుక దందా వంటి అక్రమాలకు పాల్పడిన వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో ప్రజలు తరిమేశారని అన్నారు. టీడీపీ సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.



బలపాలపల్లి వీధుల్లో పారుతున్న వర్షపునీరు

బేతంచెర్లలో భారీ వర్షం

బేతంచెర్ల, జూన్ 7 : బేతంచెర్లలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలు నిండి వంకలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. డోన్ రోడ్డులో ముచ్చట్ల వాగు రోడ్డు కోతకు గురైంది. కొలుములపల్లె, బలపాలపల్లె గ్రామాల్లో, పట్టణంలో కూడా వర్షంతో వీధుల్లోకి నీరు రావడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల పొలాల్లో వర్షం నీరు నిల్వ ఉండటంతో నీటి కుంటలుగా తలపిస్తున్నాయని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు తెలిపారు.

శాంతించిన పాలేరు

యథావిధిగా రాకపోకలు



సంజామలలో శాంతించిన పాలేరు వాగు

సంజామల, జూన్ 7 : గత రెండురోజులుగా ఉప్పొంగి ప్రవహించిన పాలేరు వాగు శుక్రవారం సాయంత్రానికి శాంతించింది. వాగు ప్రవాహం తగ్గడంతో యథావిధిగా రాకపోకలు జరుగుతున్నాయి. కోవెలకుంట్ల నుంచి సంజామల మీదుగా తాడిపత్రి, అనంతపురం, జమ్మలమడుగు, కడపకు వెళ్ళాలంటే సంజామల సమీపంలోని పాలేరువాగు దాటి వెళ్లాలి. వర్షాకాలంలో సాధారణంగానే రెండు-మూడు రోజుల పాటు వాగు ఉధృతి తగ్గదు. కొన్ని సందర్భాలలో వారంరోజుల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కాగా ఇటీవల రామ్‌కో రైల్వేలైన్ మార్గం వాగుప్రవాహానికి అడ్డంగా మారింది. వాగు ప్రవాహానికి తగ్గట్టుగా వంతెన నిర్మించక పోవడంతో రెండురోజులుగా ఇబ్బందిగా మారింది. రామ్‌కో రైల్వేలైన్‌ను వాగు ప్రవాహ సామర్థ్యానికి తగ్గట్టుగా వంతెన నిర్మించాలని గత ఏడాది సంజామల టీడీపీ నాయకులు పెండేకంటి కిరణ్‌కుమార్ రైతులతో ధర్నా చేశారు. ఇప్పటికైనా వాగు ప్రవాహానికి తగ్గ వంతెన ఏర్పాటు కాకపోతే వాగు పరివాహక ప్రాంతంలో వేల ఎకరాలలో పంటలు వరద ముంపునకు గురికానున్నాయి.

అద్దెలు చెల్లించలేక ఆర్‌బీకేలు మూత

● **నిధుల కొరతతో ఆగిన ఆర్‌బీకే భవన పనులు**



చాగలమర్రిలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న ఆర్‌బీకే

చాగలమర్రి, జూన్ 7: రైతులకు సేవలు అందించాలన్న ఉద్దేశంతో రైతు భరోసా కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసింది. ఒక్కో భవనానికి దాదాపు రూ.20 లక్షలు వెచ్చించింది. కొన్ని చోట్ల భవన నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దెలు చెల్లించక పోవడంతో యజమానులు ఖాళీ చేయించేస్తున్నారు. మండలంలో మొత్తం 17 ఆర్‌బీకేలు ఉన్నాయి. వాటిలో 6 కొత్త భవనాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. చాగలమర్రిలో ఆర్‌బీకేలను ఖాళీ చేయించి వ్యవసాయ కార్యాలయం వద్దె రెండు ఆర్‌బీకేలను నిర్వహిస్తున్నారు. చాగలమర్రిలో 5 ఆర్‌బీకేలకు సొంత భవనాలు లేవు. కూలూరు రహదారిలోని ఓ అద్దె భవనంలో రెండు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మూడు కేంద్రాలకు అద్దె చెల్లించక పోవడంతో ఖాళీ చేశారు. సిబ్బంది అంతా రెండు కేంద్రాల్లో మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. పెద్దబోదనం, ముత్యాలపాడు, డి.వనిపెంట, మద్దూరు, చిన్నవంగలి, ఆర్‌బీకేలు కొత్త భవనాల్లో కొనసాగుతున్నాయి. గొడిగనూరు, పెద్దవంగలి, శెట్టివీడు, మల్లేవేముల గ్రామాల్లో సచివాలయ భవనాల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. ఆర్‌బీకేల్లో రైతులకు విక్రయించే ఎరువులను నిల్వ చేసేందుకు స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారుకు తెలియజేసి ఖాళీ చేశాం

చాగలమర్రిలో అద్దెలు చెల్లించలేదని యజమానులు ఖాళీ చేయమని చెప్పడంతో వాటిని ఖాళీ చేశాం. ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేసి ఖాళీ చేశాం. ప్రస్తుతం వ్యవసాయ కార్యాలయ భవనం కింద ఉండే ఆర్‌బీకేలో మూడు కేంద్రాలను మరొక ఆర్‌బీకేలో రెండు కేంద్రాలను నిర్వహిస్తున్నాం. రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని సేవలు అందిస్తున్నాం. - రంగనేతాజీ, ఏవో

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా హరీష్‌బాబు

ఆళ్లగడ్డ, జూన్ 7: ఆళ్లగడ్డ పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా దేవిశెట్టి హరీష్‌బాబు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం అధ్యక్షుడు వినోద్‌కుమార్ పదవీ కాలం ముగియడంతో ఎన్నిక అనివార్యం కావడంతో ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడిని పలుకూరు సురేష్‌బాబు, సత్యనారాయణ, రవి అభినందించారు.

'ప్రజాతీర్పును గౌరవిస్తాం'

ఆళ్లగడ్డ, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని వైసీపీ మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని వారి స్వగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్ సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ 4వ సెమిస్టర్‌లో 9 మంది డీబార్

కర్నూలు(అర్బన్), జూన్ 7: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 4వ సెమిస్టర్ పరీక్షలో 9 మంది విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కన్వీనర్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం కర్నూలు, నంద్యాల జిల్లాలోని 64 పరీక్షా కేంద్రాల్లో 6,522 మంది దరఖాస్తు చేసుకోగ 5,968 మంది పరీక్షలు రాశారని పేర్కొన్నారు.

వైరస్‌తో దెబ్బతిన్న మునగ తోటలు



మునగ చెట్లను తొలగిస్తున్న రైతులు

చాగలమర్రి, జూన్ 7: ఆరుగాలం కష్టించి పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో నష్టాన్ని చవి చూడాల్సి వస్తోంది. మునగ తోటలు సాగు చేసిన రైతులు వైరస్ వల్ల దెబ్బతిని నష్టపోతున్నారు. శుక్రవారం చాగలమర్రి గ్రామంలోని కౌలు రైతు నర్సయ్య రెండెకరాల పొలంలో మునగ తోటను సాగు చేశారు. మునగ చెట్లను ఏడాది పాటు పెంచి పోషించారు. రూ.1.50 లక్షల దాక పెట్టుబడి పెట్టి మునగ తోటను సాగు చేశారు. వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల వల్ల మునగ కాయలు దెబ్బతిని దిగుబడి రాక నష్టపోవాల్సి వచ్చిందని కౌలు రైతు నర్సయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో ప్రత్యామ్నాయ పంట సాగు చేసేందుకు మునగ చెట్లను తొలగించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు కోరారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



బాధితులను పరామర్శిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె రూరల్, జూన్ 7 : వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన బాధితుల కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. నందవరం గ్రామంలో ఈనెల 5వ తేదీ టీడీపీకి ఓట్లు వేస్తారా అని పెద్ద భాస్కరయ్య గారి భాస్కర్, రవి, గోవిందులపై కర్రలు, రాడ్లు, క్రికెట్ బ్యాట్‌తో దాడి వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు టీడీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడి బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బీసీ రాజారెడ్డి, నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ మాజీ చైర్మన్ వీపీ కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు సూర్యనారాయణరెడ్డి, లక్ష్మిరెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యంగా ఉండాలని, తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైద్యులతో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని బీసీ రాజారెడ్డి కోరారు.

'కుష్ఠు వ్యాధి నిర్మూలనే లక్ష్యం'



చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంవో ప్రసాద్

చాగలమర్రి, జూన్ 7: జిల్లాలో కుష్ఠువ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేశామని డీఎంవో ప్రసాద్ తెలిపారు. శుక్రవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. కుష్ఠువ్యాధి నిర్మూలనకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మండలంలో మూడు కుష్ఠు వ్యాధి కేసులు నమోదయ్యాయని, వాటికి వైద్య చికిత్సలు చేయిస్తున్నామని అన్నారు. కుష్ఠువ్యాధి ప్రాణాంతకమైన వ్యాధి కాదని, వైద్యం ద్వార వ్యాధి నిర్మూలన చేసుకోవచ్చని అన్నారు. కుష్ఠువ్యాధి లక్షణాలు ఉన్నవారు తప్పనిసరిగా వైద్య చికిత్సలు చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఇమ్రాన్, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో లలిత సహస్ర నామ పారాయణం



చాగలమర్రి కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, జూన్ 7: చాగలమర్రి గ్రామంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం వైశాఖ మాసం సందర్భంగా సామూహికంగా మహిళలచే లలిత సహస్ర నామ పారాయణం నిర్వహించారు. అమ్మవారికి జల, క్షీరాభిషేకాలు, ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. వెండి రథంలో అమ్మవారిని కొలువుదీరింప చేసి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, జూన్ 7: రుద్రవరంలో కొలువుదీరిన కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. ఆర్యవైశ్యులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే రుద్రవరంలో కొలువుదీరిన చౌడేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అబిషేకం చేసి పూజలు ప్రారంభించారు. మహిళలు అమ్మవారికి చీరలు, బోనాలు సమర్పించారు.

'ఎమ్మెల్యే అఖిలప్రియతోనే అభివృద్ధి'



రుద్రవరంలో సంబరాలు జరుపుకున్న టీడీపీ నాయకులు

రుద్రవరం, జూన్ 7: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు పోలా గురుమూర్తి అన్నారు. రుద్రవరంలో శుక్రవారం టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. గురుమూర్తి మాట్లాడుతూ గతంలో భూమా దంపతులు చేసిన అభివృద్ధి పనులు కనబడుతున్నాయన్నారు. ప్రస్తుత ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అభివృద్ధి పనులు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు.

వర్షానికి కూలిన భారీ వృక్షం

ఆళ్లగడ్డ, జూన్ 7 : ఆళ్లగడ్డ మండలంలో శుక్రవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పి.చింతకుంటలో రోడ్డుకు అడ్డంగా భారీ వేపచెట్టు నేలకూలడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు క్రేన్ సాయంతో వేపచెట్టును తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కురిసిన వర్షపు నీటికి కాలువల్లోని మురికంతా రోడ్లపై పారుతుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది.

బీవీ సుబ్బారెడ్డి సేవలు మరవలేనివి



బీవీ సుబ్బారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

కోవెలకుంట్ల , జూన్ 7 : మాజీ ఉపముఖ్యమంత్రి బీవీ సుబ్బారెడ్డి సేవలు మరవలేనివని ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపీటీసీల సంఘం అసోసియేషన్ మాజీ జనరల్ సెక్రటరీ లాయర్ ప్రేమ్‌నాథ్ పేర్కొన్నారు. శుక్రవారం కోవెలకుంట్లలోని గ్రామ పంచాయతీ పక్కనే ఉన్న బీవీ సుబ్బారెడ్డి పార్కులో 50వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యరెడ్డి మాజీ మార్కెట్ గ్రంథాలయ అధికారి నర్సింహరెడ్డితో పాటు పలువురు నాయకులు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో చిక్కేపల్లి ప్రసాద్ రిటైర్డ్ ఉపాధ్యాయులు ఓబన్న, సీపీఎం సుధాకర్, ఆర్ఎస్ఎస్ ఓ బులేసు, బిజేపి నాయకులులింగన్న, చాందిని, రిటైర్డ్ హెడ్మాష్టర్ నారాయణస్వామి, గుంజలపాడు కృష్ణారెడ్డి , బ్యాంక్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

బేతంచెర్ల, జూన్ 7 : మండలంలోని ఆయా గ్రామాలతో పాటు పట్టణంలో శనివారం విద్యుత్‌కు 3 గంటల పాటు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీ మధుసూదన్ రెడ్డి, రూరల్ ఏఈ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. మండలంలోని సిమెంటునగర్, ఎంబాయి, సంకలాపురం, ముద్దవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల పనులు జరుగుతున్నాయని తెలిపారు. దీంతో ఉదయం 7.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు, ఆయా ఫ్యాక్టరీల యజమానులు పై విషయాన్ని గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.